నేటి కందం- నేటికి అందం

సక్రమముగ ఏ ఐ ని య
వక్ర పరాక్రమముతోడ వాడగ ఘనమౌ
మెక్రాన్మోడీ బంధము
విక్రమముగ చెలగి యొసగు విజయ శతంబున్ !!

(మెక్రాన్ మోడీ లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫ్రాన్స్ భారత్ లు కలిసి ఏ ఐ లో పరస్పరం సహకరించుకొంటుంటే రెండు దేశాలు శతాధిక విజయాలను అందుకుంటాయి అని యిరువురు నేతలు అన్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ధరణి అవకతవకల్లో
దాగిఉన్న రహస్యం
చర్యలేవి లేకుండా
చెప్పితే అపహాస్యం
గతపాలన భూమాయల
గత్తరింకా మారలేదు
భూభారతి తెచ్చినా
భూ చిక్కులు తీరలేదు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 20-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:159 పేజీలు:6 వెల: రూ.1/-


# జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు గ్రేటర్ సైబరాబాద్, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.కాగా జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2027 జనగణన నేపథ్యంలో సరిహద్దుల మార్పుపై కేంద్ర ప్రభుత్వం ఫ్రీజ్ విధించినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని గురువారెడ్డి అనే వ్యాపారి పిటిషన్ దాఖలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విభజనపై స్టే విధించాలని పిటిషనర్ కోరారు. ఈ నేపథ్యంలో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లను కూడా నియమించింది.జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగిస్తూ.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు గ్రేటర్ సైబరాబాద్, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.కాగా జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2027 జనగణన నేపథ్యంలో సరిహద్దుల మార్పుపై కేంద్ర ప్రభుత్వం ఫ్రీజ్ విధించినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని గురువారెడ్డి అనే వ్యాపారి పిటిషన్ దాఖలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విభజనపై స్టే విధించాలని పిటిషనర్ కోరారు. ఈ నేపథ్యంలో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లను కూడా నియమించింది .జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగిస్తూ.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

# గద్వాల జిల్లాలో ఆర్టీసీ బస్సుకు ఘోర ప్రమాదం

గద్వాల ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గద్వాల జిల్లాలో ఆర్టీసీ బస్సుకు ఘోర ప్రమాదం జరిగింది. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు సమీపంలో గురువారం తెల్లవారుజామున అదుపుతప్పిన బస్సు గుంతలో పడింది. హైదరాబాద్ నుంచి అనంతపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో 20 మందికిపైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పలువురికి కాళ్లు, చేతులు విరిగినట్లు సమాచారం. బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటా హుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఏఐ మనలను శాసించొద్దు.. మనమే ఏఐని శాసించాలి : ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునః సమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు.మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు.కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు.ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేధ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని



ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను ఆయన వివరించారు.

ఎం మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్ : నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఏఐ వ్యవస్థలకు మార్గనిర్దేశనం చేయాలి.

ఎ అకౌంటబుల్ : పారదర్శక నిబంధనలతో, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేయాలి.

ఎన్ నేషనల్ సావర్నిటీ : ఒక దేశంలో సృష్టించిన డేటా ఆ దేశానికే చెందాలి. ఆ దేశ పరిధిలోనే ఉండాలి.

ఓ యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్ : ఏఐ వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పనిచేయకుండా అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి రావాలి.

వి వ్యాలిడ్ అండ్ లెజిటిమేట్ : ఏఐ చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. అని ప్రధాని మోదీ చెప్పారు.

# కర్రెగుట్టలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కర్రెగుట్టలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఆపరేషన్-2 కగార్ పేరుతో కర్రెగుట్టలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలు, మావోయిస్టుల మధ్య ఎన్ కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినటట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్ కౌంటర్ కొనసాగుతోంది. బుధవారం మావోయిస్టు అగ్ర నేతలే టార్గెట్‌గా భద్రతా బలగాలు ఆపరేషన్-2 కగార్ ప్రారంభించాయి. దాదాపు ఐదు వేల మంది సీఆర్పీఎఫ్ బలగాలతో కూంబింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా, గతంలో హోంమంత్రి అమిత్ షా, 2026 మార్చి చివరికల్లా మావో యిస్టులను అంతమొందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అమిత్ షా డెడ్ లైన్ దగ్గరపడుతుండటం నేపథ్యంలో భద్రతా బలగాలు భారీ ఆపరేషన్ కు సిద్ధమయ్యారు.

# కొత్త సాంకేతికతను భారత్ అందిపుచ్చుకుంటోంది : ప్రధాని నరేంద్ర మోడీ

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొత్త సాంకేతికతను భారత్ అందిపుచ్చుకుంటోందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. సాంకేతికత కేంద్రంగా ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తోందని అన్నారు. ఢిల్లీలో ఎఐ ఇంపాక్ట్ సమిట్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మోడీ, కేంద్రమంత్రి అశ్వనీ వైభవ్ పాల్గొన్నారు. ఢిల్లీలో మోడీ ప్రసంగించారు. భారత్ ఆరోవంతు ప్రపంచ జనాభా కలిగి ఉందని, యువత.. భారత్ కు కొత్త విశ్వాసం, ఆసక్తిగా ఉందని తెలియజేశారు. వేగంగా, విశ్వాసంతో సాంకేతికతను స్వీకరిస్తున్నామని, యువత ఎఐ అమలులో ఆసక్తి కనబరుస్తున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వివిధ రంగాల సమస్యలకు ఎఐ పరిష్కారం చూపుతోందని, మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణల సామర్థ్యం ఎఐ సదస్సు చాటుతోందని మోడీ పేర్కొన్నారు. ఎఐ సామర్థ్యం ఆలోచనలకు అందనంత దూరంగా ఉందని, మానవ కేంద్రీకృత ఎఐ నిర్మాణ మన లక్ష్యం కావాలని అన్నారు. భారత్ ఎఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందని, మానవ అభివృద్ధిలో ఎఐ కీలక భూమిక పోషిస్తుందని కొనియాడారు. మానవులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో ఉన్నాయని, ఎఐ మన పనితీరును మరింత పరిపుష్టం చేస్తుందని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు.

# గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్: జ్యూరీ కమిటీలో కీలక మార్పు..

హైదరాబాద్, ఫిబ్రవరి 19: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో జ్యూరీ కమిటీలో కీలకమైన మార్పు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో భాగంగా ఇచ్చే 'స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, విశ్లేషకుడు తమ్మారెడ్డి భరద్వాజను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు స్వీకరించనున్నారు.

చలనచిత్ర పరిశ్రమలో తమ్మారెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవం, సామాజిక అంశాలపై ఆయనకున్న అవగాహనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన ఉత్తేజాన్ని నింపనున్నాయి.

ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ అవార్డులలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో ఈ నూతన అవార్డులను ప్రతి ఏడాదీ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024 – 25 సంవత్సరంలో విడుదలైన సినిమాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

# సంగారెడ్డి జిల్లాలో భారీ చోరీ.. వృద్ధురాలి బంగారం అపహరణ..

సంగారెడ్డి, ఫిబ్రవరి 19: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టపగలే భారీ చోరీ (ఏనీణతిజూవబి ఃబీబ రాబిజీనిట ంష్త్రవటబి) జరిగింది. ఓ శుభకార్యానికి వెళ్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. ఆమె బ్యాగులోని 16 తులాల బంగారాన్ని అత్యంత చాకచక్యంగా అపహరించారు. అల్లాదుర్గానికి చెందిన చెగురి లక్ష్మి అనే వృద్ధురాలు.. హైదరాబాద్‌లోని తన మేనకోడలి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరింది.

ఈ క్రమంలో అల్లాదుర్గం నుంచి జోగిపేట బస్టాండ్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ దిగి, తన బంధువుతో కలిసి హైదరాబాద్ వెళ్లే మరో బస్సు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీని అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు.. ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పోలీసుల దర్యాప్తు..

బంగారం పోయిందని గుర్తించిన బాధితురాలు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ (అఅ) కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

అనుమానిత వ్యక్తుల కదలికల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విలువైన వస్తువులు తీసుకెళ్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడిని త్వరగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

# మైనర్ బాలికకు గంజాయి తాగించి .. ముగ్గురు రౌడీ షీటర్లు అత్యాచారం

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నగరంలోని నార్సింగి పిఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికకు గంజాయి తాగించి ఆ మత్తులో ఉండగా.. ముగ్గురు రౌడీ షీటర్లు ఆమెపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాలిక ఛార్మినార్ పిఎస్ పరిధి నుంచి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో బాలిక మిస్సింగ్ కేసు నమోదైంది. నార్సింగిలో తన నాన్నమ్మ ఉండటంతో బాలిక అక్కడకు వచ్చిందని తెలుస్తోంది. అయితే ఈ దారుణానికి పాల్పడిన నిందితులు పరారీలో ఉన్నారని.. వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. బాలిక నెక్నంపూర్ డివిజన్ పాషా కాలనీకి చెందిన బాలికగా గుర్తించారు.

# విద్యుత్ సంస్థలో అవినీతిపై ప్రభుత్వం ఉక్కుపాదం.. 8 మంది ఇంజినీర్ల సస్పెన్షన్..

హైదరాబాద్, ఫిబ్రవరి 19: దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది.

విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి.

విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు అసిస్టెంట్ ఇంజినీర్లు సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది.

అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామే..

**-తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్**
**-తాను పెట్టబోయే పార్టీలో కొత్త తరానికి అవకాశం**
**-భవిష్యత్ లో తెలంగాణలో బిజెపి ఉండదు**
**-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొత్త పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ ఏర్పాటు చేస్తామని అన్నారు. కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఖరారైంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు అని.. సిద్దిపేట, బోధన్.. రెండింట్లో ఒకచోట పోటీ చేస్తానని తెలియజేశారు. మొటి చాయిస్ సిద్దిపేట, రెండో చాయిస్ బోధన్ అని అన్నారు. ఎంపిటిసి, జడ్పిటిసి, జిహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీ చేస్తానని, బిఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోందని విమర్శించారు. తాను పెట్టబోయే పార్టీ వ్యక్తులపై నడవదని.. వ్యవస్థలపై నడుస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎపి అధ్యక్షురాలు షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడి ప్రజలకు నచ్చలేదని చెప్పారు. సినీ నటుడు చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా? అని ప్రశ్నించారు. తన లైన్ లో తాను వెళ్తున్నానని.. తన ప్రయత్నం తనది




అని.. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని అన్నారు. తాను పెట్టబోయే పార్టీలో కొత్త తరానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామేనని, భవిష్యత్ లో తెలంగాణలో బిజెపి ఉండదు అని కవిత పేర్కొన్నారు.

# సమస్క - సారలమ్మల వీరగాథను ఆసక్తిగా విన్న రాహుల్, ఖర్గే..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ మంత్రులతో కాంగ్రెస్ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క - సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు.

పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# రంజాన్ ఉపవాస దీక్షలతో ఆత్మ శుద్ధి, స్వీయ నియంత్రణ

## (19 ఫిబ్రవరి "రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం" శుభ సందర్భంగా)

ముస్లింల పవిత్ర మాసం రంజాన్ వచ్చేసింది. 18 ఫిబ్రవరి 2026 రోజు సాయంత్రం 7:30 గంటలకు నెలవంక స్పష్టంగా దర్శనం ఇవ్వడంతో మన తెలుగు రాష్ట్రాల ముస్లిం సోదర సోదరీమణులు 'చాంద్ ముబారక్" అంటూ సంబరాలు చేసుకొని 19 ఫిబ్రవరి 2026 నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించి నెల రోజుల పాటు జరుపుకుంటారు. ఫిబ్రవరి మాసంలో దీక్షలు ప్రారంభం కావడం అరుదుగా జరుగుతుంది.

33 ఏండ్ల తర్వాత రంజాన్ ఫిబ్రవరి నెలలో ప్రారంభం కావడం విశేషం. రంజాన్ ఉపవాసాలు శీతాకాలంలో ప్రారంభమై వేసవి ప్రారంభ వేళల్లో ముగుస్తుంది. ఇస్లామిక్ కాలపట్టిక 'హిజ్రీ' ప్రకారం 9వ నెలను రంజాన్‌గా పిలుస్తారు. రంజాన్ మాసంలో పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించడం, నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆత్మ శుద్ధి, దాతృత్వం, భక్తిని పెంపొందిస్తాయని నమ్మకం. అల్లాహ్ కోసం ఆకలి, దప్పికను సహిస్తారు. అత్యంత అదృష్ట రాత్రి "లైలతుల్ ఖదర్" కూడా ఈ మాసంలో రావడం ఒక విశేషం. ఇస్లామిక్ విశ్వాసాల ప్రకారం, దాదాపు 1,400 ఏండ్ల క్రితం రంజాన్ మాసంలో ప్రవక్త ముహమ్మద్‌కు ఖురాన్ వెల్లడైందని విశ్వాసం.

### ఉపవాస దీక్షలు – కఠోర నియమనిబంధనలు:

సూర్యోదయానికి ముందు (సెహ్రి) భోజనం చేయడం, సూర్యాస్తమయం తర్వాత (ఇఫ్తార్) విందుతో ఫాస్టింగ్‌ను విడవడం ఈ నెల రోజుల పాటు కొనసాగుతుంది. ఉపవాస సమయంలో ఏమీ తినడం, తాగడం, ధూమపానం, మద్యపానం, సంభోగం లాంటివి జరగవు. ఈ మాసంలో అబద్దాలు ఆడడం, చెడు మాటలు చెప్పడం, కోప్పడడం జరగదు. ప్రతి రోజు పవిత్ర గ్రంథం 'ఖురాన్' పఠనం విధిగా జరుగుతుంది.

పేదలతో కలిసి సహోరి భోజనాలు చేయడం, ఇఫ్తార్ విందులు, హలీం, ఖుబూబ్, ఖజూర్ లాంటి రుచికరమైన వంటకాలు సువాసనలను వెదజల్లుతాయి. రంజాన్ శుభ గడియల్లో తమ సంపాదనలో 2.5 శాతం 'జకాత్' ఇస్తూ, పేదలకు దానధర్మాలు, అనాథలకు చేయూతలు అందిస్తారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, రోగులు, ప్రయాణీకులు, పిల్లలకు ఉపవాస దీక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు తర్వాత సమయాల్లో 'ఖజా' చేయవలసి ఉంటుంది. రంజాన్ ఉపవాస మాసం ముగిసిన రోజు నెలవంక కనిపించడంతో 'ఈద్ ఉల్ ఫితర్' రంజాన్ లేదా 'రమదాన్' పర్వదినం జరుపుకుంటారు.

### శారీరక, మానసిక ఆరోగ్య నియమాలు :

నెల రోజుల ఉపవాస దీక్షలతో జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి, పునరుజ్జీవనం, గొప్ప ఆరోగ్య ప్రయోజనం కలుగుతాయి. ఏడాదిగా శరీరంలో పేరుకుపోయిన మలినాలను శుభ్రం చేసి తొలగించడానికి రంజాన్ ఉపవాసాలు ఉపయోగపడతాయి.

సూర్యాస్తమయం తర్వాత 'ఇఫ్తార్' విందు చేసి నిద్ర పోవడం, సూర్యోదయానికి ముందు లేచి 'షహూర్' భోజనాలు చేయడం జరుగుతుంది.

ఖర్జూరాలు, పరిమిత మాంసాహారాలు, కూరగాయలు, పండ్లు లాంటివి తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏడాదికి ఒక రంజాన్ మాసం ఉపవాసాలతో మిగిలిన 11 నెలల పాటు శరీరం ఆరోగ్యంతో మెరుగ్గా పని చేస్తుంది.

ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ఆత్మ పరిశీలన, స్వీయ నియంత్రణలకు ప్రాధాన్యం ఇస్తారు.

రంజాన్ ఉపవాస దీక్షల శుభ సందర్భంగా ముస్లిమ్ సమాజానికి "రంజాన్ ముబారక్", "రంజాన్ కరీం" శుభాకాంక్షలు తెలియజేద్దాం.



–ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకారశాఖ మంత్రులతో మంతన్ సమావేశాన్ని నిర్వహించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నేడు గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సహకార మంత్రులతో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మంతన్ సమావేశం నిర్వహించారు. 'సహకార్ సే సమృద్ధి' (సహకారం ద్వారా సమృద్ధి) అనే ఇతివృత్తంతో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇథనాల్, ఇంధనం, సేంద్రీయ పొటాష్, గిడ్డంగులు, ప్రోటీన్ పౌడర్ ప్లాంట్లకు సంబంధించి రూ.265 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీ అమిత్ షా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఒక ప్రదర్శనను సందర్శించి, సహకార రంగంలోని ఉత్తమ విధానాలు, అంతర్జాతీయ సహకార సంవత్సరంపై రూపొందించిన నివేదికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రులు శ్రీ క్రిషన్ పాల్ గుర్జార్, శ్రీ మురళీధర్ మోహోల్, సహకార శాఖ కార్యదర్శి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రతి రంగంలోనూ పురోగమిస్తోందని కేంద్రమంత్రి అన్నారు. రాబోయే 25 ఏళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్దేశించే రంగాల్లో భారత్ నేడు అగ్రగామిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ మంతన్ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన భారత్ అంటే కేవలం గణాంకాలు మాత్రమే కాదని, 140 కోట్ల మంది ప్రజలు గౌరవంగా జీవించగలిగే వ్యవస్థను సృష్టించడమేనని ఆయన వివరించారు. దేశంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించడానికి సహకార రంగం మాత్రమే సరైన మాధ్యమంగా మారుతుందని స్పష్టం చేశారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక రంగాలను బలోపేతం చేయకపోతే సమగ్ర జాతీయ అభివృద్ధిని సాధించ లేమని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ప్రయత్నాన్ని విజయవంతం చేయడానికి మనమందరం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లుగా సహకార రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించిన శాస్త్రీయ దృక్పథం వల్ల ఇప్పుడు సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

సహకార రరంగాల ప్రాముఖ్యతను పెంపొందించడానికి ఆహార ధాన్యాల నిల్వపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో నిల్వ సామర్థ్యాన్ని దాదాపు మూడు రెట్లు పెంచాల్సిన అవసరం ఉందని, ఇందులో రెండు వంతుల విస్తరణ సహకార రంగం ద్వారానే జరగాలని సూచించారు. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. నిల్వ సామర్థ్యాన్ని పెంచే బాధ్యతను కేవలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకే వదిలేయకూడదని సూచించారు. మండల స్థాయి సహకార డెయిరీలు, రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ సమాఖ్యలు, ఆర్థిక సహాయం ద్వారాజిల్లా సహకార బ్యాంకులు, జిల్లా కొనుగోలు–విక్రయ సంఘాలు కలిసి పెద్ద ఎత్తున గిడ్డంగులను నిర్మించాలని కోరారు. దేశంలోని 70 శాతం ఆహార ధాన్యాలు ఉత్తర భారత్ (పంజాబ్, హర్యానా) నుంచి సేకరిస్తున్నారని తెలిపారు. సేకరణ, నిల్వ, పంపిణీని ప్రాంతాల వారీగా సమన్వయం చేస్తే రవాణా ఖర్చులను కనీసం 30 నుంచి 40 శాతం తగ్గించ వచ్చని వివరించారు. దేశవ్యాప్తం గా నిల్వ వ్యవస్థ ఒకే పద్ధతిలో ఉండాలని మరియు అది అందరి కీ సులభంగా అందుబాటులో ఉండేలా తీర్చిద్దాలని తెలిపారు.

మూతపడిన చక్కెర మిల్లులను తిరిగి ప్రారంభించేందుకు అన్ని రాష్ట్రాలు కృషి చేయాలని శ్రీ అమిత్ షా కోరారు. ఇందుకోసం జాతీయ స్థాయి సహకార సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న చక్కెర మిల్లులు కేవలం చక్కెరకే పరిమితం కాకుండా ఎరువులు, గ్యాస్ ఉత్పత్తిని కూడా చేపట్టవచ్చని సూచించారు. చక్కెర మిల్లుల ద్వారా దాదాపు 11 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని నిరూపితమైందని పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో దీనికి సంబంధించిన కార్యాచరణను ఖరారు చేస్తామని, చక్కెరను మాత్రమే ఉత్పత్తి చేసే మిల్లుల్లో అవసరమైన అన్ని భాగాలను చేర్చడంలో జాతీయ స్థాయి సహకార సంస్థ సహాయపడుతుందని తెలిపారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సరళమైన విధానాలను అవలంబించాల్సి ఉంటుందన్నారు.

ప్రతి రాష్ట్రం తమ పాడి పరిశ్రమ, సహకార విభాగాల బృందాలను బనాస్ డెయిరీని సందర్శించడానికి పంపాలని కేంద్ర హోం, సహకార మంత్రి సూచించారు. బనాస్ డెయిరీ వివిధ కార్యక్రమాలను చేపట్టిందని, వాటి నుంచి అన్ని రాష్ట్రాలు ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు.

అన్ని సహకార సంస్థలు తమ బ్యాంకు ఖాతాలను జిల్లా సహకార బ్యాంకుల్లోనే నిర్వహించాలని ఆయన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. భారత ప్రభుత్వ పథకాలన్నింటికీ సహకార బ్యాంకులను సమన్వయ సంస్థలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. పీఎం కిసాన్, వృద్ధాప్య పెన్షన్లు వంటి పథకాల నిధులను ఈ సహకార బ్యాంకుల ద్వారానే పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవా లని కోరారు.

రిటైల్ కార్మికులు, వడ్రంగులు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు వంటి శ్రమ దోపిడీకి గురవుతున్న వర్గాల కోసం రాబోయే రోజుల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. దీంతో వారు గౌరవప్రదమైన వేతనాన్ని పొందగలుగుతారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో దేశ జనాభాలో 40 శాతానికి పైగా ప్రజలు సహకార రంగంతో అనుసంధాన మవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వచ్చే సంవత్సరాల్లో భారత్ టాక్సీ సేవలు ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌కు చేరుకుంటాయని కేంద్ర హోం, సహకార మంత్రి వెల్లడించారు. ఇప్పటికే 3 లక్షల మందికి పైగా డ్రైవర్లు దీనిలో చేరారని, దీనివల్ల డ్రైవర్లకు, ప్రయాణికులకు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

అంతకముందు వివిధ ప్రదర్శనల ద్వారా సహకార రంగానికి సంబంధించిన పురోగతి, విజయాలు, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేసేందుకు 2 లక్షల కొత్త బహుళార్థసాధక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, పాడి, మత్స్యకార సహకార సంఘాల ఏర్పాటులో పురోగతిని చర్చించారు. రైతులకు మెరుగైన నిల్వ సదుపాయం, ధరల స్థిరత్వం, మార్కెట్ అందుబాటును కల్పించేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యపు నిల్వ పథకం కింద దేశవ్యాప్తంగా ఆధునిక గిడ్డంగుల వ్యవస్థను విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

సహకార సంస్థల ద్వారా ఎగుమతులు, సేంద్రీయ సాగు, నాణ్యమైన విత్తన సరఫరాను ప్రోత్సహించడానికి కొత్తగా ఏర్పడిన జాతీయ సహకార సంస్థలు..నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్), భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ (బీబీఎస్ఎస్ఎల్) చురుగ్గా పాల్గొన్నాయి. 97వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా మోడల్ చట్టాన్ని స్వీకరించడం, రాష్ట్ర సహకార చట్టాలలో కాలానికి అనుగుణంగా మార్పు లు చేయడంపై చర్చించారు. సహకార చక్కెర మిల్లుల ఆర్థిక లాభదాయకతను పెంచడం, పాడి రంగంలో స్థిరత్వాన్ని పెంపొందించడం, అముల్, ఎన్‌డీడీబీ సహకారంతో కొత్త పాడి సంఘాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

ఈ సమావేశంలో పప్పుధాన్యాలు, మొక్కజొన్న ఉత్పత్తిని ప్రోత్సహించడం, సహకార బ్యాంకులకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై వివరణాత్మక ప్రదర్శనలు ఇచ్చారు. సహకార రంగంలో ప్రధాన వ్యవస్థను బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదును పెంచడం, సమర్థవంతమైన మీడియా, కమ్యూనికేషన్ వ్యూహాలను అభివృద్ధి చేయడంపై చర్చలు జరిగాయి. సహకార రంగాన్ని ఆధునీకరించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలకు పలు సూచనలు చేశారు. అవి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయాలను పూర్తిగా కంప్యూటరీకరించాలి. జాతీయ సహకార డేటాబేస్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. మానవ వనరుల అభివృద్ధి, శిక్షణపై శ్రద్ధ వహించాలి. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ పథకాలను క్షేత్రస్థాయిలో మెరుగ్గా అమలు చేయాలి.

## ఏఐ ఇండియా ఇంపాక్ట్ ఎక్స్‌పో–2026 ప్రారంభంలో ముఖ్యమైన అంశాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఆలోచనలు, ఆవిష్కరణలు, సంకల్పాల సంగమంగా భారత్ ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో–2026ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు.

ప్రారంభోత్సవానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పంచుకొంటూ.. ప్రపంచ క్షేమం కోసం కృత్రిమ మేధ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారతీయ ప్రతిభకున్న అసాధారణ సామర్థ్యాన్ని ఈ ఎక్స్‌పో తెలియజేస్తుందని శ్రీ మోదీ అన్నారు.

అన్నింటికీ మించి, మానవ ప్రగతికి బాధ్యతాయుతంగా, సమ్మిళితత్వంతో, విస్తృత స్థాయిలో ఏఐను ఉపయోగించుకోవడంలో భారత దేశ నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటించిందన్నారు.

"ఆలోచనలు, ఆవిష్కరణలు, సంకల్పాల శక్తిమంతమైన సంగమమే ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో–2026. ప్రపంచ క్షేమం కోసం కృత్రిమ మేధ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారతీయ ప్రతిభకున్న అసాధారణ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

అన్నింటికీ మించి, మానవ ప్రగతికి సంబంధించి బాధ్యతాయుతంగా, సమ్మిళితత్వంతో, విస్తృత స్థాయిలో ఏఐను ఉపయోగించుకోవడంలో మా చిత్తశుద్ధిని ఇది పునరుద్ఘాటిస్తుంది. కొన్ని ముఖ్యాంశాలు..."

## సంస్కృత సుభాషితాన్ని పంచుకుంటూ... ప్రజా శ్రేయస్సు కోసం మేధస్సు లక్షణాలను ప్రస్తావించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి నిజంగా ఉపయోగకరంగా మార్చడంలో మేధస్సు, హేతుబద్ధత, నిర్ణయం తీసుకునే సామర్థ్యాల ప్రాముఖ్యాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు స్పష్టం చేశారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు గురించి ప్రధానంగా ప్రస్తావించిన ఆయన... పౌరులందరి సంక్షేమం కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోగల మార్గాలను అన్వేషించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ప్రధానమంత్రి పేర్కొన్నారు.'ఎక్స్' వేదికగా ప్రాచీన గ్రంథంలోని శ్లోకాన్ని ఉటంకిస్తూ మేధస్సుకు గల అద్భుత లక్షణాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు:''మేధస్సు, హేతుబద్ధత, నిర్ణయం తీసుకోగల సామర్థ్యాలు శాస్త్ర, సాంకేతికతలను ప్రజలకు ఉపయోగకరంగా చేస్తాయి. అందరి ప్రయోజనం కోసం ఏఐని సద్వినియోగం చేసుకోగల మార్గాలను అన్వేషించడమే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లక్ష్యం.

## ఇతర దేశాల నాయకులతో లోక్‌సభ స్పీకర్ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఈ రోజు ఢాకాలో జరిగిన బంగ్లాదేశ్ నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా హాజరయ్యారు. ప్రధానమంత్రి శ్రీ తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా శ్రీ ఓం బిర్లా భారత ప్రజల తరపున ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

లోక్‌సభ స్పీకర్ ఢాకాలో బంగ్లాదేశ్ ప్రధాని శ్రీ తారిక్ ెం ఎ ా వ ా న్ తో సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా భారత్‌ను సందర్శించవలసిందిగా శ్రీ తారిక్ రెహమాన్‌ను కోరుతూ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పంపిన వ్యక్తిగత లేఖను ఆయన అందజేశారు.

ప్రజాస్వామ్య, అభ్యుదయ, సమ్మిళిత దేశంగా ఎదిగేందుకు బంగ్లాదేశ్ చేసే కృషికి భారత్ ఎప్పుడూ అండగా ఉంటుందని శ్రీ ఓం బిర్లా పునరుద్ఘాటించారు. రెండు పొరుగు దేశాల మధ్య ఉన్న చిరకాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ ముయిజ్జు, భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ తోబ్గేను లోక్‌సభ స్పీకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## అవనిగడ్డకు చాగంటి రాక

అవనిగడ్డ, ఫిబ్రవరి 19: ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈ నెల 21వ తేదీ అవనిగడ్డకు విచ్చేయనున్నారు. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ నైతిక విలువల కమిటీ చైర్మన్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు.

ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తమ కుటుంబ సభ్యులతో కలిసి చాగంటి కోటేశ్వరరావుకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేయనున్నారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# బారామతిలో జరిగిన లియర్‌జెట్ 45 (వీటీ-ఎస్ఎస్‌కే) విమాన ప్రమాద దర్యాప్తునకు సంబంధించి ఏఏఐబీ విడుదల చేసిన తాజా సమాచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: జనవరి 28, 2026న బారామతిలో జరిగిన లియర్‌జెట్ 45 (వీటీ–ఎస్ఎస్‌కే) విమాన ప్రమాదంపై, విమాన ప్రమాద పరిశోధన సంస్థ (ఏఏఐబీ) సమగ్ర విచారణ చేపడుతోంది. ఈ విచారణను విమాన (ప్రమాదాలు, సంఘటనల పరిశోధన) నిబంధనలు–2017, ఐసీఏఓ అనెక్స్ 13 అంతర్జాతీయ ప్రమాణాలు, సిఫార్సు పద్ధతులకు లోబడి నిర్వహిస్తోంది.

విమానంలో రెండు స్వతంత్ర ఫ్లైట్ రికార్డర్లు ఉన్నాయి. ఈ రెండూ దీర్ఘకాలం పాటు అధిక వేడికి గురవటంతో ప్రమాద సమయంలో అగ్ని ప్రమాదం వల్ల దెబ్బతిన్నాయి.

ఎల్3–కమ్యూనికేషన్స్ సంస్థ తయారు చేసిన డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డీఎఫ్‌డీఆర్) నుంచి డేటాను ఫ్లైట్ రికార్డర్ లాబొరేటరీలో ఏఏఐబీ విజయవంతంగా డౌన్‌లోడ్ చేసింది. హనీవెల్ సంస్థకు చెందిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)కు ప్రస్తుతం సాంకేతిక పరీక్ష నిర్వహిస్తుంది. డేటా వెలికితీతలో ప్రత్యేక సాంకేతిక సహకారం కోసం ఆ పరికరాలను తయారు చేసిన దేశానికి సంబంధించి, గుర్తింపు పొందిన ప్రతినిధి సహాయాన్ని కోరింది. నిష్పక్షపాతంగా, పక్కా ఆధారాలతో సమగ్ర విచారణను నిర్వహించేందుకు అన్ని సాంకేతిక పద్ధతులను, నిబంధనలను ఏఏఐబీ కచ్చితంగా పాటిస్తోంది. ఈ విషయంలో పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని, విచారణలో పురోగతిని బట్టి తదుపరి వివరాలను వెల్లడిస్తామని సంస్థ తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు కొనసాగేలా సహకరించాలని, అప్పటివరకు ఎలాంటి ఊహాగానాలకు అవకాశం ఇవ్వకూడదని అన్ని వర్గాలను ఏఏఐబీ కోరింది.

# ఆటో కార్మికులకు చేయూత..



అమరావతి, ఫిబ్రవరి 19: సమాజంలో పేదరికం నిర్మూలించాలన్న సీఎం చంద్రబాబు ఆశయ స్ఫూర్తితో ఎంపీ కేశినేని శివనాథ్ ఆటో కార్మికులకు అండగా నిలిచి చేయూత అందించేందుకు తన సొంత నిధులతో చేపట్టిన ఆటోల పంపిణీ కార్యక్రమం వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని మాజీ ఎమ్మెల్సీ , టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా అన్నారు. పశ్చిమ నియోజకవర్గం వన్ టౌన్ గణపతిరావు రోడ్ లో గల ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆటోల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో సితార జంక్షన్ లోని టి.ఎన్.టి.యు.సి అనుబంధ సంస్థ విజయదుర్గా గూడ్స్ ఆటో ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ కి చెందిన ముగ్గురు కార్మికులకు మూడు ఆటోలు ఏర్పాటు చేశారు. ఈ ఆటోల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ టిడిపి ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఉమ్మడి కృష్ణాజిల్లాల గ్రంథాలయ చైర్మన్ ఎమ్.ఎస్. బేగ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా ఆటోలు పంపిణీ చేయటంతో పాటు జెండా ఊపి ఆటోలు ప్రారంభించారు.

ఎంపి కేశినేని శివనాథ్ సహకారంతో ఏర్పాటు చేసిన మూడు ఆటోలను ఆటో కార్మికులు 44వ డివిజన్ కి చెందిన తమ్మ పవన్ కుమార్, 45వ డివిజన్ కి చెందిన చింత వెంకట నారాయణ, ఎమ్.డి జాఫర్ భాష అందుకున్నారు. ఆటోలు ఇప్పించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కి ఆటో కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ టిడిపి ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న మాట్లాడుతూ పేద ఆటో కార్మికులకు ఉపాధి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో మూడు ఆటోలను పంపిణీ చేశారన్నారు.

రోజువారీ జీవనాధారం కోసం ఆటో నడిపే కార్మికులకు ఎంపీ కేశినేని శివనాథ్ అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఆయన అందించిన సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అదే స్ఫూర్తితో ఎంపీ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పు చేసినవారికి శిక్ష తప్పదని కూడా పేర్కొన్నారు. వైసిపి నాయకుడు అంబటి రాంబాబు చేసింది ముమ్మాటికి తప్పేనంటూ..తప్పు చేశాడు కాబట్టే రాజమండ్రి జైలుకి వెళ్లాడన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల గ్రంథాలయ చైర్మన్ ఎమ్.ఎస్ బేగ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, మాట్లా డుతూ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పేదలను ఆదుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇందువల్ల ఎంతో మందికి లబ్ధి చేకురుతుందన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

అమరావతి, ఫిబ్రవరి 19: ఈ నెల 23 నుండి నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారిణి ఎం నీలావతి దేవి అన్నారు. స్థానిక జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో గురువారం నీలావతి దేవి విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు సంబంధించి హాల్ టిక్కెట్స్ పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా ఎవరైన హల్ టిక్కెట్లు తీసుకోని వారు ఉంటే వెంటనే తీసుకోవాలన్నారు. విధి నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

ప్రశ్న పత్రాలు కూడా ఈ రోజు నుండి పల్నాడు జిల్లాలో ఉన్న 16 పోలీస్ స్టేషన్లకు చేరుకుంటున్నాయని, పరీక్షలకు సంబంధించిన సామాగ్రి అంతా కేంద్రాలకు పంపించడం జరిగిందని, ఈ పరీక్షలన్నీ సీసీ కెమేరా పర్యవేక్షణలో జరుగుతున్నాయని, దీనిపై జిల్లా కేంద్రాలలో, రాష్ట్ర కేంద్రాలలో పర్యవేక్షణ జరుగుతుందన్నారు.

# నూతన కౌలుచట్టం తీసుకురావాలి



విజయవాడ, ఫిబ్రవరి 19: ఎన్నికల హామీ మేరకు నూతన కౌలు చట్టం తీసుకొచ్చి కౌలురైతులకు రక్షణ, వారి సంక్షేమానికి చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని సంఘ కార్యాలయం దాసరి భవన్ లో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర నాయకులు దొంతా కృష్ణ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ? మారిన పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో కీలకమైన భూమికను పోషిస్తున్న కౌలురైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికల ముందు కౌలురైతుల సంక్షేమానికి చేసిన వాగ్దానాలు గద్దెనెక్కిన తర్వాత విస్మరించడం దుర్మార్గమన్నారు.

వ్యవసాయ సంక్షోభం కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగ కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించటానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ఇంతకన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. పోరాడితేనే కౌలురైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని, కౌలురైతులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న కౌలరైతుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

ఉదారంగా కౌలురైతులకు పంట రుణాలు జారీ చేయాలని, కౌలు రైతులకు తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానాలు చేసిందని ఆ తీర్మానాలను ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పత్రికలకు తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా భూమిలేని కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఈ రెండేళ్లలో ఒక పైసా కూడా ఇవ్వకుండా మోసం చేసిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసిందన్నారు.

భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, భూ యజమాని బ్యాంకు బకాయిలతో సంబంధం లేకుండానే పంట రుణాలు అందించాలని విజ్ఞప్తి చేసిందన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా పరిహారం కౌలురైతులకే చెల్లించాలని, పెరుగుతున్నకౌలు రేట్లు నియంత్రించడానికి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేసిందన్నారు.

కౌలురైతుల డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంతో కలిపి ఫిబ్రవరి 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చిందన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుండి కౌలు రైతులకు సులభతరంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరుతూ మార్చి 18వ తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద ఆందోళన నిర్వహించాలని నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన చట్టం తీసుకురాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కౌలురైతులను సమీకరించి చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించిందని పి.జమలయ్య చెప్పారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కంటి పరీక్షా శిబిరం

అమరావతి, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా లోని ఉరవకొండ మండలంలోని చిన్న ముష్టూర్ గ్రామం వద్ద ఉన్న, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు, సిబ్బందికి ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 54 మంది విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి, కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్టోమెట్రిస్ట్ కిషోర్, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్ లు దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

అవసరమైన వారు నాణ్యమైన కళ్ళజోడులను ధరించాలని, కంటి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశ్రీఫ్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించడం వల్ల వారి విద్యా సామర్థ్యం మెరుగుపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ వెంకటేష్ నాయక్, కెమిస్ట్రీ అధ్యాపకులు సుబ్బ రాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామగుండం మేయర్

కరీంనగర్, ఫిబ్రవరి 19: పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్షను కలెక్టరేట్‌లో నూతనంగా ఎన్నికైన రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

కార్పొరేటర్లు ఎండీ ముస్తఫా, గట్ల రమేష్, వడ్లూరి రవి, గడ్డం రమ శ్రీనివాస్, చిదురాల నాగరాజు, ధూళికట్ట సతీష్, నాయకులు దాసరి విజయ్, అజయ్ సింగ్, కుడిదెల శివ, కారెంగుల సురేష్, నన్నీ, గుడికందుల రవి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈరన్న గుట్ట క్రషర్ అనుమతులు రద్దు చేయాలి కలెక్టర్‌కు వినతి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 19 : జనగామ జిల్లా రఘునాథ పల్లి మండలం కోమల్ల గ్రామంలో ఉన్న ఈరన్న గుట్ట క్రషర్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఆ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ జరిపి నివేదికను అందజేయాలని జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్ కుమార్ ను ఆదేశించారు.

అనంతరం కోమల్ల గ్రామ సర్పంచ్ వల్లాల అశోక్, మాజీ సర్పంచ్ బొల్లపల్లి మంజు ల మధుసూదన్ మాట్లాడుతూ.. క్రషర్ నిర్వాహకులు కోమల్ల గ్రామ గత పాలక వర్గానికి తెలియకుండా, కనీసం గ్రామసభ తీర్మానం లేకుండా 2023 సంవత్సరంలో నాటి తహసిల్దార్ నుంచి అక్రమంగా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్ ఓసీ)ను పొంది ప్రస్తుతం ఈరన్న గుట్ట వద్ద పనులు చేపట్టారన్నారు.

గత తహసీల్దార్ జారీ చేసిన 'ఎన్వోసీ' తేదీ కన్నా ముందుగానే నాటి సర్పంచ్ బొల్లపల్లి మంజుల నేతృత్వంలోని పాలకవర్గం 17 జూన్ 2019 న గ్రామ పరిధిలో ఉన్న పొట్టి గుట్ట, ఈరన్న గుట్టపై గ్రానైట్ క్వారీ, క్రషర్ కు సంబంధించి ఎలాంటి త్రవ్వకాలు జరపొద్దని గ్రామ సభలో తీర్మానం కూడా చేసినట్లు పేర్కొన్నారు.

# కౌన్సిల్ ఎజెండాపై చర్చ

### –నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమీక్ష



విజయవాడ, ఫిబ్రవరి 19: ఫిబ్రవరి 21, న జరిగే కౌన్సిల్ ఎజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో గురువారం ఉదయం శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండా ఉన్న ప్రతిపాదనలను శాఖధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ. రవీంద్రరావు, సెక్రటరీ ఇంచార్జి కె. ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ తి/ఇ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. శ్రీనివాస్, సామ్రాజ్యం, ప్రభాకర్, సురేఖ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, గోపాల నాయక్, బయాలజిస్ట్ కామేశ్వరరావు , వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వైన్స్ షాపుల పర్మిట్ రూమ్‌ల్లోకి సాయంత్రం 6 తర్వాతే : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



నల్గొండ, ఫిబ్రవరి 19: ప్రతి రోజు సాయంత్రం 6 గంటల తర్వాతే వైన్ షాపుల పర్మిట్ రూమ్‌ల్లోకి అనుమతి ఇవ్వాలని, ఆ లోపు ఎట్టి పరిస్థితుల్లో పర్మిట్ రూమ్‌ల్లోకి అనుమతించ వద్దని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిర్వాహకులకు మరోమారు స్పష్టం చేశారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న వైన్ షాప్ వద్ద ఎమ్మెల్యే కాసేపు ఆగి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయంత్రం 6 గంటల లోపు పర్మిట్ రూమ్ లో గాని చుట్టూ పరిసరాల ప్రాంతాల్లోనూ ఎవ్వరు కూడా మందు తాగొద్దని వైన్ షాప్ నిర్వాహకులకు మరోమారు గట్టిగా చెప్పారు. తాను సూచించిన విధంగా వైన్ షాపుల సమయ పాలన నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు.

# భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో హెచ్-125 ఫైనల్ అసెంబ్లీ లైన్ కీలకమైన మైలు రాయి: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఎయిర్‌బస్ హెచ్-125 లైట్ యుటిలిటీ హెలికాప్టర్‌కి సంబంధించిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ తుది అసెంబ్లీ లైన్‌ను 2026 ఫిబ్రవరి 17న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు శ్రీ ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ ముంబయి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇది కర్ణాటకలోని వేమగల్ వద్ద ఉంది. రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ఫ్రెంచ్ సైనిక, మాజీ సైనిక ఉద్యోగుల వ్యవహారాల మంత్రి క్యాథరిన్ వౌట్రిన్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కేఆర్ నాయుడు, కర్ణాటక భారీ, మధ్య తరహా పరిశ్రమల మంత్రి డాక్టర్ ఎంబీ పాటిల్ ఫైనల్ అసెంబ్లీ లైన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు.

భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఓ మైలురాయిగా హెచ్-125 హెలికాప్టర్ల ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. "ఫ్రాన్స్‌తో మా సహకారం అపరిమితమైనది. పరస్పర ప్రయోజనకరమైన మా భాగస్వామ్యానికి ఆకాశం కూడా హద్దు కాబోదు" అని ఆయన అన్నారు. భారత్‌లో సీ-295 రవాణా విమానాల తయారీ ఒప్పందం అనంతరం, హెచ్-125 కార్యక్రమం చేపట్టిన టీఏఎస్ఎల్, ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ సంస్థలను ఆయన అభినందించారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి తోడ్పడేలా, అంతర్జాతీయ పరికరాల తయారీ సంస్థలతో కలిసి భారత్ పనిచేయగలదని చెప్పడానికి ఈ ప్రాజెక్ట్ ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

2014 నుంచి భారతదేశ ఆర్థిక విధానానికి మూలాధారాలుగా మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ఉన్నాయని రక్షణ మంత్రి వివరించారు. మిత్ర దేశాలతో పరస్పర ప్రయోజనాలను అందించే భాగస్వామ్యాల ద్వారా క్లిష్టమైన సాంకేతికతల్లో స్వయం సమృద్ధిని సాధించడంలోనూ, అత్యాధునిక ఉత్పత్తులను, పరికరాలను తయారు చేయడంలోనూ ప్రధాన మంత్రి మోదీ సారథ్యంలోని ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేస్తుందన్నారు.

హెచ్-125 కార్యక్రమానికి రూ. 1,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేసినట్లు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అలాగే దీని ద్వారా నైపుణ్యాలున్న యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వివిధ రకాల వాతావరణ పరిస్థితుల్లో అసాధారణమైన విశ్వసనీయత, బహుళ ప్రయోజనాలు, అత్యుత్తమమైన పనితీరుకు హెచ్-125 హెలికాప్టర్లు పేరుగాంచాయన్నారు. "ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన, విశ్వసనీయమైన సింగిల్-ఇంజిన్ హెలికాప్టర్లలో హెచ్-125 ఒకటి అని నిరూపితమైంది" అని ఆయన తెలియజేశారు.

దశాబ్దానికి పైగా కాలం నుంచి పెట్టుబడి నిబంధనల సరళీకరణతో పాటు.. భారీ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం లాంటి అనేక పథకాల ద్వారా కీలక రంగాల్లో మూలధన పెట్టుబడులతో పారిశ్రామిక ప్రగతి పథంలో భారత్ వేగంగా పయనిస్తోందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటును అందించడం, అంకుర సంస్థల వ్యవస్థను బలోపేతం చేయడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలియజేశారు. "సమగ్ర పారిశ్రామిక అభివృద్ధిని సాధించడమే మా లక్ష్యం. ఇది మన దేశీయ అవసరాలను మాత్రమే కాకుండా, ఇతర దేశాల అవసరాలను కూడా తీరుస్తుంది" అని ఆయన అన్నారు.

ఆయుధ పరిశ్రమలను కార్పొరేట్ చేయడం, ఉదారవాద పెట్టుబడి పథకాలు, రక్షణ పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో సహా రక్షణ పారిశ్రామిక వ్యవస్థలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ చేపట్టిన సంస్కరణల గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు. భారత రక్షణ ఉత్పత్తి గతంలో ఎక్కువగా ప్రభుత్వ రంగంపైనే ఆధారపడి ఉండేదని ఆయన అన్నారు. దీనికి భారీ పెట్టుబడి, దీర్ఘ కాలం ఎదురు చూడాల్సి రావడం తదితర కారణాలున్నాయని తెలిపారు. ఫలితంగా, ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రైవేట్ రంగం వాటా ఆశించిన స్థాయిలో ఉండేది కాదని వివరించారు. అయితే, ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రస్తుతం రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ రంగం వాటా దాదాపు నాలుగో వంతుకు చేరుకుందని, రక్షణ ఎగుమతులు కూడా అనేక రెట్లు పెరిగాయన్నారు. ఇవి రక్షణ ఎగుమతుల్లో అగ్రగామి దేశాల సరసన భారత్‌ను నిలబెట్టాయని వివరించారు.

ఈ వృద్ధి మార్గం ఎంఎస్ఎంఈలకు, అనుబంధ రంగాలకు భారీ ప్రోత్సాహాన్ని అందించిందని, ప్రస్తుతం వీటి సంఖ్య 16,000 దాటిందని రక్షణ మంత్రి తెలిపారు. అలాగే భారతీయ ఎంఎస్ఎంఈల నుంచి విడి భాగాలను అనేక విదేశీ సంస్థలు కొనుగోలు చేస్తున్నాయని వెల్లడించారు. అర్థవంతమైన సాంకేతిక బదిలీ, ఇతర దేశాల భద్రతా అవసరాలను తీర్చేందుకు అత్యాధునిక పరిష్కారాలను అందించడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని కంపెనీలను ఆయన ఆహ్వానించారు.

చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, రక్షణ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, కార్యదర్శి (రక్షణ ఉత్పత్తి) శ్రీ సంజీవ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎత్తయిన ప్రాంతాల్లో చేపట్టే కీలకమైన కార్యకలాపాల్లో బహుళ ప్రయోజనాలు అందించేలా హెచ్125 ఎంను రూపొందించారు. తక్కువ శబ్దం, ఉష్ణ సంకేతాలను ఉపయోగించుకొని వ్యూహాత్మక అన్వేషణ, నిఘా అందించేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తయిన ప్రాంతాలకు రవాణా చేస్తుంది. మారుమూల సరిహద్దు అవుట్‌పోస్టులకు అవసరమైన వస్తువులను చేరవేస్తుంది. శోధన, రక్షణ, వైద్య తరలింపు కార్యకలాపాల్లో వేగంగా స్పందించే సాధనంగా పనిచేస్తుంది.

ఎవరెస్ట్ శిఖరంపై ల్యాండయిన ఏకైక హెలికాప్టర్‌గా హెచ్125 చరిత్ర సృష్టించింది. ఇది ప్రస్తుతం అందుబాటులో ఉన్న తేలికపాటి యుటిలిటీ ఫ్లీట్‌ల కంటే ఎంతో మెరుగైన పనితీరును కనబరిచింది. ప్రపంచంలోనే అత్యంత సవాలుతో కూడుకున్న ఎత్తయిన, వేడి వాతావరణాల్లో పనిచేసే భారతీయ సైనికులకు ఇది కీలకమైన సేవలను అందిస్తుంది.

సీ295 మిలటరీ ట్రాన్స్‌పోర్ట్ ఫైనల్ అసెంబ్లీ లైన్ తర్వాత టాటా అడ్వాన్స్ సిస్టమ్స్, ఎయిర్ బస్ పారిశ్రామిక సహకారంలో కుదిరిన రెండో ప్రధాన ఒప్పందం ఇది. ఇది భారత్‌లో సమగ్ర సైనిక వైమానిక రంగాన్ని బలోపేతం చేస్తుంది.

# బీజేపీకి మద్దతు ఇచ్చి.. ఇప్పుడు నిధుల కోసం ప్రదక్షణలు

### –రాజశేఖర్ రెడ్డి ఆశయాలు కాంగ్రెస్ తోనే సాధ్యం
### –కాంగ్రెస్ తీసుకొచ్చిన ఉపాధి హామీని నీరుగారుస్తున్నారు
### –వేల్పూరు రచ్చబండ కార్యక్రమంలో షర్మిల



అమరావతి, ఫిబ్రవరి 19: వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అద్భుతమైన పథకాలను అందించిన ఏకైక నాయకుడు రాజశేఖర్ రెడ్డని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలా అన్నారు. అప్పటి సీఎంగా రాజశేఖర్ రెడ్డి, ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని ఇప్పటి కేంద్ర బీజేపీ ప్రభుత్వం నీరుగార్చి, ఉపాధి హామీ పథకాన్ని తుంగలో తొక్కలని చూస్తుందని దూయబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీపై నూతనంగా తీసుకు వచ్చిన చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టాన ఆదేశాల మేరకు రాష్ట్రంలో షర్మిల చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామం కళామందిర్ సెంటర్లో వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బోయపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం గురువారం నిర్వహించారు.

ఈ రచ్చబండ కార్యక్రమంలో ముందుగా షర్మిల ప్రజలతో మాట్లాడారు. పనికి వెళ్లినా వేతనాలు సకాలంలో పడడం లేదని, పోస్టల్ బ్యాంకులో అకౌంట్ ఉంటేనే డబ్బులు పడతాయని ఫీల్డ్ అసిస్టెంట్లు చెబుతున్నారని షర్మిల దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా గతంలో పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, పనిముట్లు అందించే వారని ఇప్పుడు చూద్దాం అన్నా ఎక్కడ కనపడట్లేదని వాపోయారు. ఇంకా ఉపాధి హామీ లో ఉన్న అనేక సమస్యలను ఆవె దృష్టికి తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి షర్మిల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఆకలి చావులను ఆపి, కరువును, గ్రామాల్లోని వలసలను ఆపడానికి కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం లేకుండా చేయాలని చూస్తోందన్నారు. మహాత్మాగాంధీ పేరును తీసేసి వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (జి.రామ్.జి) పేరుతో కొత్త చట్టం తీసుకువచ్చి పథకాన్ని నీరుగార్చి పేదల కడుపు కొడుతున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ నిధులను 60 శాతం కేంద్రం ఇచ్చి 40 శాతం రాష్ట్రాలు పెట్టుకోవాలనడం ఈ పథకాన్ని తీసేయాలనే ఉద్దేశం కాదా అని ప్రశ్నించారు. అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని ఇంకా దిగజార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తీరును ఎండగట్టారు.

గతంలో 6 గంటలు ఉన్న పని కాలాన్ని ఇప్పుడు 12 గంటలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీ ఆశయాలను చంపాలనే ఉద్దేశంతో మోడీ చేస్తున్న కుట్రలు తిప్పి కొట్టాలని ఈ కార్యక్రమానికి నడుం బిగించి కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ బిల్లుకు పార్లమెంట్లో మద్దతు ఇచ్చి ఇప్పుడు డబ్బులు ఇవ్వమని కేంద్రం చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ బిజెపిని భుజస్కంధాలపై మోస్తూ ఉపాధిని నీరుగారుస్తున్నా ఏమీ మాట్లాడకపోవడం వారి భయానికి నిదర్శనమని విమర్శించారు. మన రాష్ట్రానికి నిధులు తేవడం లో ప్రభుత్వం విఫలమైందని, ఎంపీలు అనేకమంది ఉండి కూడా పార్లమెంటులో ప్రాజెక్టుల గురించి ప్రస్తావనే తీసుకురావడం లేదని దూయబట్టారు.

ప్రజల పక్షాన నిలిచేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని మిగిలిన పార్టీలన్నీ బీజేపీకి బినామీలుగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. గతంలో దివంగత నేత రాజశేఖర్ రెడ్డి తీసుకువచ్చిన అనేక పథకాలు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాయని, మరలా అవి కొనసాగాలంటే రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అభ్యర్థించారు. రాజశేఖర్ రెడ్డి కూతురు మీద నమ్మకంతో రచ్చబండ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మస్తాన్వలి తదితర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పది రోజుల బిడ్డతో.. 12వ తరగతి పరీక్షకు హాజరైన యువతి

ముంబై, ఫిబ్రవరి 19: ఒక యువతి పది రోజుల బిడ్డతో కలిసి 12వ తరగతి పరీక్షకు హాజరైంది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. నవజాత శిశువు కోసం ఉయ్యాల కూడా ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ సంఘటన జరిగింది. 21 ఏళ్ల శీతల్ చంద్రకాంత్ చిట్టే పది రోజుల కిందట నవజాత శిశువుకు జన్మనిచ్చింది. ఫిబ్రవరి 18న ఆ బిడ్డను ఎత్తుకుని 12వ తరగతి పొలిటికల్ సైన్స్ బోర్డు పరీక్షకు ఒంటరిగా హాజరైంది.

కాగా, ఇది గమనించిన పరీక్షల నిర్వాహకులు, అధికారులు శీతల్‌కు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఆమె పరీక్ష రాసేందుకు అనుకూలంగా ఒక క్లాస్‌రూమ్ కేటాయించారు.

# అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు దుర్మరణం



ఉత్తర్‌ప్రదేశ్, ఫిబ్రవరి 19: కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మధుర జిల్లా లోని మాగోర్రా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువ లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

మృతులను రాహుల్ (23), అమిత్ (22), మోహిత్ (22) గా గుర్తించారు. మరో వ్యక్తిని వారి స్నేహితుడిగా గుర్తించినట్లు తెలిపారు. వారంతా రాజస్థాన్‌లోని డీగ్‌కు ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీయించి పోస్టు మార్టానికి పంపించారు.

ఘటనపై రూరల్ ఎస్పీ సురేశ్ మాట్లాడుతూ.. 'నలుగురు యువకులు మహావన్ నుంచి డీగ్‌కు బైపాస్ ద్వారా గోవర్ధన్ మీదుగా కారులో వెళు తుండగా ప్రమాదం జరిగింది. మలుపు తిరుగుతున్న సమయంలో కారు అదుపుతప్పి లోతైన కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురూ చనిపోయారు. క్రేన్ సాయంతో కారును వెలికితీసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నాం' అని చెప్పారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 జయంతి



నల్గొండ, ఫిబ్రవరి 19: భారతీయ పరాక్రమానికి ధైర్య సాహసాలకు నిలువుటద్దాం స్వరాజ్య -స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వేడుకులను నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధి చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో అత్యంత వైభవంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ హాజరై శివాజి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దైద రవీందర్ మాట్లడుతూ అన్యాయానికి వృతిరేఖంగా పోరాడి పైందవ ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరుడు అని, పరిపాలన దక్షత, గెరిల్లా యుద్ధ తంత్రలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.

దేశంకోసం ధర్మాన్ని రక్షించడానికి నేటి యువతి, యువకులు పోరాటం చేయల్సిన అవసరమందని, స్త్రీలను గౌరవించని రాజ్యానికి భవిష్యత ఉండదని వారు అన్నారు. అపరమైన మొఘలుల సైన్యన్ని తన గే?రిల్లా యుద్ధ తంత్రాలతో గడగడాలలించిన ధైర్యశాలి శివాజీ అఫ్జల్ ఖాన్ ను అంతం చేయడం ఆగ్రా కోట నుండి తప్పించుకోవడం అయన ధైర్య సాహసలకు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్ల పార్టీ రవీందర్ రెడ్డి ఆరెగూడెం సర్పంచ్ నాగం పల్లి శ్యాంసుందర్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి నాయకులు రాముడు దశరథ శ్రీను ఒంటె పాకం నక్షత్ మహేష్ సతీష్ మోహన్ సైదులు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఆరోగ్యం, విద్య రంగాలపై ఏఐ ఇంపాక్ట్ కేస్‌బుక్స్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్య వ్యవస్థల్లో కృత్రిమ మేధ సేవలను వినియోగించుకోవడమెలాగో తెలియజేసిన కేస్‌బుక్స్‌ను ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 సందర్భంగా ఆవిష్కరించారు. వీటిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ , నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికత్వ శాఖతో పాటు ఇండియాఏఐ మిషన్‌ల మార్గదర్శకత్వంలో రూపొందించారు. దీనికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ వంటి భాగస్వామ్య సంస్థలు కూడా మద్దతును అందించాయి.

ప్రయోగాత్మక దశ కన్నా మిన్నగా వైద్యశాలలు, తరగతిగదులు, నైపుణ్యాలను నేర్పించే అనుబంధ విస్తారిత వ్యవస్థల్లో ఉపయోగించిన ఏఐ సేవలను గురించి ఇతివృత్త ప్రధానమైన కేస్‌బుక్స్‌లో వివరించారు. కొలవదగిన ఫలితాలు, స్కేలబుల్ మాడళ్లను (విశేషించి భారత్, అభివృద్ధి కోసం తపిస్తున్న దేశాల్లో) కళ్లకు కట్టే ఈ పుస్తకాలను సంస్థాగతంగా ఏఐని వాడడం కోసం ఆచరణీయ నమూనాల మాదిరిగా తీర్చిదిద్దారు. ఇవి నైతిక పరిపాలనకీ, ఇంటరాపరబులిటీకీ, పబ్లిక్-ప్రయివేట్ సహకారానికీ, సాక్ష్యాధారిత మూల్యాంకనానికీ పెద్ద పీట వేశాయి.

ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై)కి చెందిన జీ కేటగిరీ శాస్త్రవేత్త, ఏఐ అండ్ ఈటీ విభాగం సమూహ సమన్వయకర్త కవిత భాటియా మాట్లాడుతూ, "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026ను దృష్టిలో పెట్టుకొని ఈ ఆరు గ్రంథాలను సంకలన పరచడంలో సహకారాన్ని అందించిన భాగస్వాములు అందరికీ నేను హృదయపూర్వక కృతజ్ఞతల్ని తెలియజేస్తున్నాను. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ వాస్తవిక ప్రభావాన్ని వివరించిన కేస్‌బుక్ పట్ల ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఐసీఎంఆర్‌లు వహించిన మార్గదర్శకత్వంతో పాటు, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిరంతర ప్రాతిపదికన అందించిన సహకారాన్ని నేను గుర్తిస్తున్నాను. ఇది సాంకేతిక భాగస్వామిగా ఉంటూ ప్రపంచ స్థాయిలో ప్రమాణీకృత, సాక్ష్యాధారిత ఎంపిక ప్రక్రియకు దిశానిర్దేశం చేసింది" అన్నారు.

ఎంఈఐటీవై జాయింట్ డైరెక్టరు శిఖా దహియా మాట్లాడుతూ, "ఈ కేస్‌బుక్స్ ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ అందించిన ముఖ్య పరిణామాల్లో ఒకటి. ఇవి ఆరోగ్యం, విద్య రంగాలలో కృత్రిమ మేధను వాస్తవిక జీవనంలో ఉపయోగించే సందర్భాలను గురించి వివరిస్తాయి. అంతే కాక ఇవి కొలవదగిన ప్రభావం ఆధారంగా శిఖరాగ్ర సదస్సు కేంద్రీకరించిన దృష్టికో ణానికి అద్దం పడుతున్నాయి. ఈ ప్రచురణలు బలమైన రిఫరెన్స్ పాయింట్లుగా పనిచేస్తాయనీ, ఈ ముఖ్య రంగాల్లో విధానాల భావిగతిని నిర్ణయించడంలో తోడ్పడతాయనీ వేం ఆశిస్తున్నాం" అన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆగ్నేయ ఆసియా ప్రాంత ఆఫీసర్-ఇన్-చార్జి కేథరినా బోహ్మే మాట్లాడుతూ, "కృత్రిమ మేధపై జరిగే చర్చను ముందుకు తీసుకుపోయి, అభ్యాస పూర్వక ఆచరణ దశకు చేర్చడం ఈ గ్రంథ సంకలనాల ఉద్దేశం. ప్రపంచం అంతటా పెచ్చుపెరుగుతున్న ఆరోగ్య సమస్యల్నీ, శ్రమశక్తి సంబంధిత సవాళ్లనీ, సేవల అందజేతకు సంబంధించిన సమస్యల్నీ ఎదుర్కొనే ఒక సాధనంగా కృత్రిమ మేధ ఎదుగుతోంది. బలమైన కృత్రిమ మేధ సంబంధిత పాలన ప్రణాళికను రూపొందించి, వివిధ దేశాల్లో సాంకేతిక, నైతిక సామర్థ్యాన్ని పెంచి, సాక్ష్యాధారిత ఏఐని స్వీక రించడాన్ని ప్రోత్సహిం చడంలో దేశాలకూ, ప్రభుత్వాల కూ మద్ద తివ్వడానికి డబ్ల్యూహెచ్‌ఓ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంది" అన్నారు.

## చెన్నైలోని కత్తుపల్లి మెసర్స్ ఎల్ అండ్ టీలో తొలి సైనిక విద్యార్థుల శిక్షణ నౌక - కృష్ణ ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: చెన్నైలోని మెసర్స్ ఎల్ అండ్ టీ కత్తుపల్లి షిప్‌యార్డులో రూపొందిస్తున్న మూడు సైనిక విద్యార్థుల శిక్షణ నౌకల్లో (సీటీఎస్) మొదటిదైన యార్డ్ 18003 (కృష్ణ)ను 2026 ఫిబ్రవరి 16న ప్రారంభించారు. నౌకాదళ సంప్రదాయాలకు అనుగుణంగా, సాయుధ దళాల ప్రధానాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సమక్షంలో.. శ్రీమతి అనుపమ చౌహాన్ ఈ నౌకను ప్రారంభించారు. భారత సాయుధ దళాలు, చెన్నైలోని మెస్సర్స్ ఎల్ అండ్ టీ నౌకా నిర్మాణ సంస్థ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## 10వ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన..

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19: ; టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రోజున పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన నిమిత్తం వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి వివిధ పాఠ్యాంశాల పరీక్షా అంశాలను, రాతాంశాలను క్రమమైన పద్ధతిలో చాలా క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల పరిశీలన తదనంతరము చాలా సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులు గణనీయమైన మార్కులు సాధించుటకు గాను ఉపాధ్యాయులు చేయవలసిన కార్యక్రమాల గురించి సముచితమైన రీతిలో తగు సూచనలు చేశారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో అత్యున్నతమైన ఫలితాలు సాధించి జిల్లాకు మరియు మీ పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు హితోపదేశం చేశారు. ఇటు బృహత్ కార్యక్రమంలో పరిశీలన బృందం ఉపాధ్యాయ సభ్యులు ప్రకాష్ , వరప్రసాద్ , అశోక్ వెంకట్రావుపల్లి ప్రధానోపాధ్యాయులు రమేష్ , రవీందర్ రాజు, భుజేంద్ర చారి, సుధాకర్ , శ్రీధర్ నాగరాజు పాల్గొన్నారు.

## ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో ఇంధనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఇంధనం, సౌలభ్య కల్పనపై దృష్టి సారించే ఏఐ ప్రభావ అధ్యయన ప్రచురణలను ఆవిష్కరించారు. సుస్థిర ప్రగతి, సమ్మిళిత వృద్ధి దిశగా కృత్రిమ మేధ వినియోగంపై ప్రపంచ దేశాల అనుభవాలను ఈ ప్రచురణలు వెల్లడిస్తాయి. ఈ ప్రచురణలన్నీ ప్రభుత్వాల్లోని వివిధ మంత్రిత్వ శాఖలు, అంతర్జాతీయ ఏజెన్సీలు, పరిశోధన సంస్థలు, ఫౌండేషన్‌ల సహ కారంతో ప్రచురితమయ్యాయి. ఆయా దేశాల విధాన రూప కర్తలతోపాటు అభ్యాసకులకు దీర్ఘకాలిక జ్ఞాన వనరులుగా ఇవి రూపొందాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) భాగస్వామ్యంతో ఇంధన అంశంపై సంకలనాన్ని తయారు చేశారు. ఇంధన మార్పిడిలో ఏఐ ద్వంద్వ పాత్రను ఇది ప్రముఖంగా వివరిస్తుంది. కంప్యూటింగ్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు ఇంధన డిమాండ్‌కు చోదకంగా మారిన ఏఐ మరోవైపు ఇంధన వ్యవస్థలో పొదుపు మెరుగుదలలోనూ తోడ్పడుతుంది. గ్రిడ్ గరిష్ఠీకరణ, పునరుత్పాదక ఇంధన ఏకీకరణ, డేటా సెంటర్ సామర్థ్యం, వాతావరణ నిబద్ధతల కారణంగా పెరిగే కంప్యూటింగ్ అవసరాల సమతౌల్యం దిశగా ఆధునిక పరిష్కారాల కోసం ఈ సంకలనంలోని పత్రాలు ఉపయోగపడతాయి.

దివ్యాంగులకు సహాయక పరికరాలు, ముందస్తు రోగ నిర్ధారణ, సానుకూల అభ్యాసం, అధునాతన కృత్రిమ అవయవాలు, మానసిక ఆరోగ్య మద్దతు దిశగా ఏఐ సారథ్యంలోని కార్యక్రమాలను సౌలభ్య సంబంధిత పుస్తకం అవగతం చేస్తుంది. అంతేకాకుండా గోప్యత రక్షణ, నైతికత విస్తరణ, సాంస్కృతికంగా సందర్భోచిత ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని కూడా వివరిస్తుంది.

ఈ ప్రచురణల ఆవిష్కరణ సందర్భంగా ఎన్‌ఐసీ డైరెక్టర్ జనరల్-మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి- భారత్ ఏఐ సీఈవో శ్రీ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ- "సదస్సు సన్నాహక సంప్రదింపుల సమయంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఏఐ ప్రభావ అధ్యయనాల ప్రచురణ కూడా ఒకటి.

దీంతోపాటు ఉత్తమ పద్ధతులు, ప్రపంచ ఆచరణల సంకలనం కూడా అందులో భాగం'' అన్నారు. వివిధ దేశాలకు.. ముఖ్యంగా వర్ధమాన దేశాలు సహా ఒకేవిధమైన పలు అభివృద్ధి సవాళ్లు ఎదుర్కొంటున్న దేశాలకు ఈ ప్రచురణలు మార్గదర్శకం కాగలవని చెప్పారు. మరోవైపు ప్రభుత్వాలు, ఆవిష్కర్తలందరూ విజయవంతమైన పరిష్కారాలను పునరావృతం చేయడంలోనే కాకుండా అంకుర సంస్థలతో సంధానానికి, ప్రభావశీల కార్యక్రమాలను అమలు చేయడానికి ఈ జ్ఞాన భాండాగారం దోహదం చేస్తుందన్నారు.

అనంతరం 'ఐఈఏ' పరిధిలోని చీఫ్ ఎనర్జీ ఎకనామిస్ట్ కార్యాలయంలో వరల్డ్ ఎనర్జీ అవుట్‌లుక్ ప్రతినిధి శ్రీ సిద్ధార్థ్ సింగ్ మాట్లాడుతూ- ఏఐ సృష్టించిన ఇంధన డిమాండ్‌పై మరింతగా దృష్టి సారిస్తున్నప్పటికీ ఇంధన రంగంపై ఏఐ సానుకూల ప్రభావాన్ని గుర్తించడం కూడా అంతే ముఖ్యమన్నారు.

ఆర్థిక వ్యవస్థతోపాటు సమాజానికి ప్రయోజనం చేకూర్చే ఏఐ ఉత్పాదక సామర్థ్యాలపై దృష్టి సారించడాన్ని ఇది ప్రోత్సహించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేపో మాపో రైతు భరోసా..!

## -ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు కాంగ్రెస్ ఘనతే
## -నాడు ఇందిరమ్మ, రాజశేఖర్ రెడ్డి హయాంలో..
## -నేడు సీఎం రేవంత్ హయాంలోనే ఇండ్లు
## -తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్



ఆదిలాబాద్, ఫిబ్రవరి 19: సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలనలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమయ్యాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. మండలంలోని దత్తప్ప గూడెం లో లబ్ధిదారురాలు గనగాని సువర్ణ సాయిలు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో ఎమ్మెల్యే సామెల్ పాల్గొని నూతన ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామెల్ మాట్లాడుతూ నాడు ప్రధాని ఇందిరాగాంధీ, సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు ఇండ్లు మంజూరు కాగా,నేడు మళ్లీ సిఎం రేవంత్ హయాంలో పేదలకు ఇండ్లు నిర్మిస్తున్నామని ఇది ప్రజా ప్రభుత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఘనతేనన్నారు.

గత బి ఆర్ ఎస్ 10 ఏండ్లలో బొందల గడ్డలు,స్మశాన వాటికలు నిర్మించారని ఎద్దేవా చేశారు. మోత్కూర్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ కి గొప్ప విజయాన్ని అందించిన మోత్కూర్ మున్సిపల్ ప్రజలకు,దత్తప్పగూడెం లో సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కి పట్టం కట్టిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపో మాపో రైతు భరోసా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతా యన్నారు.

కాంగ్రెస్ హయాంలో సన్న బియ్యం, ఉచిత బస్సు మహిళలకు,ఉచిత కరెంటు, రైతు భరోసా,రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ వనిముట్లు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నా రు.

దత్తప్పగూడెం లో కత్వ సమస్యల పరిష్కారానికి తాను ఇరిగేషన్ డి ఈ తో మాట్లాడానని,డి ఈ వచ్చి ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తే ఇరిగేషన్ శాఖ నుండి నిధులు మంజూరు చేయించి సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే స్వయంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుండు యాదగిరి గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి,మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య,ఏ పి ఐ డి సి మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి,సింగిల్ విండో మాజీ చైర్మన్ పి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ ఇటికాల ఎల్లమ్మ, కౌన్సిలర్లు గనగాని శైలజ,కుర్మిళ్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌ను అంతర్జాతీయ వైజ్ఞానిక శక్తిగా నిలిపే చోదక శక్తి ఏఐ.. 2047 నాటికి వికసిత భారత్ సాకారంలో ఏఐ కీలకం: శ్రీ ధర్మేంద్ర ప్రధాన్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో భాగంగా.. 'విద్యా మంత్రిత్వ శాఖ ? భారత్‌లో ఏఐ పరిధుల విస్తరణ' శీర్షికన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో విద్యా మంత్రిత్వ శాఖ ఓ ప్రత్యేక సదస్సును నిర్వహించింది.

కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ సదస్సులో పాల్గొన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక వ్యవహారాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ జయంత్ చౌదరి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పాఠశాల విద్య, అక్షరాస్యత కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి, ఐఐటీ మద్రాసు కార్యదర్శి ప్రొఫెసర్ వి. కామకోటి, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యలో ఏఐని వినియోగించే ప్రముఖ అంకుర సంస్థల వ్యవస్థాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ ప్రధాన్ మాట్లాడుతూ.. దేశంలో కృత్రిమ మేధ వికాసాన్ని ప్రదర్శించడానికి, దాన్ని మరింత వేగవంతం చేసే దిశగా గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనల నుంచి పుట్టిన విప్లవాత్మక కార్యక్రమంగా ఈ సదస్సును అభివర్ణించారు.

భారత్ సాధిస్తున్న వేగవంతమైన సాంకేతిక పురోగతిని ప్రధానంగా ప్రస్తావిస్తూ.. భారత్ అసాధారణ వేగంతో కృత్రిమ మేధను అందిపుచ్చుకుంటున్న తీరును చూసి ప్రపంచం మనవైపు ఆశగా చూస్తోందని శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వైజ్ఞానిక శక్తిగా భారత్‌ను నిలపడంలో ఏఐ విప్లవాత్మక పాత్ర పోషిస్తుందనీ, 2047 నాటికి వికసిత భారత్‌ను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందనీ ఆయన ధీమా వ్యక్తం చేశారు.

యువ ఆవిష్కర్తలది ఇందులో కీలక పాత్రగా ఉంటుందని చెబుతూ.. భారతీయ యువత మునుపటి తరాల కన్నా భిన్నమైన రీతిలో ఆలోచిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. "విద్యలో ఏఐ, ఏఐపై విద్య అన్నవి పరస్పరం బలంగా అనుసంధానమై ఉన్నాయి" అని ఆయన చెప్పారు. విద్యార్థులు, యువ నిపుణులు ఏఐని వినియోగించుకుని అవగాహన పెంచుకోవాలనీ, దాన్ని అందిపుచ్చు కోవా లనీ, సాధికారత సాధించాలనీ.. విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టాలనీ పిలుపునిచ్చారు. ప్రపంచ ఏఐ రంగంలో భారత్‌ను అగ్రగామి శక్తిగా నిలపడంలో ఈ కృషి దోహదపడుతుందన్నారు.

ఇండియా ఇంపాక్ట్ సదస్సులో జరిగిన చర్చలు విలువైన సమాచారాన్ని అందించాయని శ్రీ జయంత్ చౌదరి పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో.. విద్యాసంస్థలు, పరిశ్రమలకు చెందిన ప్రముఖులు విద్యా వ్యవస్థలో ఏఐ నిర్మాణాత్మక ఏకీకరణపై చర్చించారని ఆయన తెలిపారు. వికసిత భారత్‌ఏ 2047 లక్ష్యానికి అనుగుణంగా, అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచే దిశగా- ప్రాథమిక విద్య నుంచి నైపుణ్యాభివృద్ధి, పరిశోధన వరకు.. ప్రతి దశలోనూ ఏఐ అనుసంధానంపై చర్చలు సాగాయని వివరించారు.

విద్యా మంత్రిత్వ శాఖ, స్కిల్ ఇండియా వేదికలను కూడా తాను సందర్శించానన్నారు. ఆచరణీయ, భారీ స్థాయికి విస్తరించదగిన, 'భారతే ప్రథమం' లక్ష్యంగా ఉన్న ఏఐ మార్గాలను వాటిలో ప్రదర్శించారని తెలిపారు. ప్రభుత్వ విధానపరమైన దార్శనికతను.. ఇవి ప్రభావవంతమైన క్షేత్రస్థాయి ఆచరణగా మారుస్తున్నాయని వ్యాఖ్యానించారు.

జాతీయ డిజిటల్ వేదికలు, విధానపరమైన ఏర్పాట్లు, సంస్థాగత సంస్కరణలు, పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, అధునాతన పరిశోధన - ఆవిష్కరణ వ్యవస్థల్లో విస్తృతంగా సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా.. గత దశాబ్ద కాలంగా కృత్రిమ మేధ ఆధారిత విద్యకు విద్యా మంత్రిత్వ శాఖ బలంగా పునాదులు వేసింది.

గతేడాది బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా.. ఐఐటీ- మద్రాసులో 'విద్య కోసం కృత్రిమ మేధ'పై ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యలో ఏఐ ఏకీకరణ కోసం ప్రణాళికను రూపొందించే క్రమంలో.. విద్యాసంస్థలు, పరిశ్రమలు, పౌర సమాజం, ప్రభుత్వ సంస్థలతో విద్యా మంత్రిత్వ శాఖ విస్తృత స్థాయి సంప్రదింపులు జరిపింది. ఇటీవల విద్యారంగంలోని కృత్రిమ మేధ అంకుర సంస్థల వ్యవస్థాపకులతో మంత్రి చర్చించారు. అలాగే, కీలక భాగస్వాములను ఒకచోట చేర్చి.. ఏఐ చోదకంగా బాధ్యతా యుత పరివర్తనను ముందుకు తీసుకెళ్లడంపై.. మంత్రి అధ్య క్షతన 'భారత్ బోధన్ ఏఐ కాన్‌క్లేవ్- 2026' పేరిట రెండు రోజుల సమావేశాన్ని నిర్వహించారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా జరిగిన ఈ సదస్సు.. భారత్ తన విధానపరమైన దార్శనికతను భారీ స్థాయి అమలు దిశగా మలుస్తున్న తీరును చాటింది. ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు, పాఠ్యప్రణాళికను ఏకీకృతం చేయడం, పరిశ్రమలు - అంకుర సంస్థల మధ్య బలమైన భాగస్వామ్యం ద్వారా ఈ మార్పును సాధిస్తున్నట్టు ఈ సదస్సు వివరించింది.

## చింతలపాలెం ఎస్సీ కాలనీలో చెత్త సమస్య పరిష్కారం

చింతలపాలెం, ఫిబ్రవరి 19 : చింతలపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన చెత్త సమస్యను పరిష్కరించేందుకు వార్డు మెంబర్ చింతిరాల సురేందర్ తన సొంత నిధులతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్డులో దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తను గురువారం జెసిబి సాయంతో తొలగించి పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, వార్డు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేశారు. వార్డు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని తన సొంత ఖర్చులతో సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఎస్సీ కాలనీ వార్డు మెంబర్ సురేందర్ చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన సేవలను అభినందించారు.

# ఎన్ఎం- ఐసీపీఎస్ కింద రూ. 235 కోట్ల మద్దతు, ఇండియా ఏఐ మిషన్ కింద రూ.10,585 కోట్ల వ్యయంతోమరింత బలోపేతం కానున్న భారత్ జెన్: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: భారత మొట్టమొదటి ప్రభుత్వ యాజమాన్య, సార్వభౌమ "లార్జ్ లాంగ్వేజ్ మోడల్" (ఎల్ఎల్ఎం), బహుభాషా ఏఐ స్టాక్‌ను ప్రశంసిస్తూ, కేంద్ర సైన్స్, టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ శాఖ (స్వతంత్ర హోదా), పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి అంతరిక్ష విభాగాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన "భారత్-జెన్ మోడల్స్: విజన్ అండ్ టెక్నికల్ ఎగ్జిక్యూషన్ 2026" సెషన్‌లో ప్రసంగిస్తూ, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇకపై కేవలం ఒక ఐచ్ఛికం మాత్రమే కాదని, జీవితంలోని ప్రతి రంగంలో పని చేయడానికి అది ఒక అనివార్యమైన భాగమని శ్రీ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో భాగంగా ఇండియా ఏఐ మిషన్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై), సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్టీ) సహకారంతో భారత్ జెన్ ఈ సెషన్‌ను నిర్వహించింది.

భారత్ జెన్ బృందాన్ని అభినందిస్తూ, సాంకేతిక స్వయంసమృద్ధి దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారతదేశ సామాజిక, సాంస్కృతిక నేపథ్యం, భాషా వైవిధ్యానికి అనుగుణంగా రూపొందించిన ప్రభుత్వ యాజమాన్యంలోని సార్వభౌమ బహుభాషా, మల్టీమోడల్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) చొరవగా భారత్ జెన్ ప్రత్యేకత కలిగివుందని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ప్రసిద్ధి చెందినప్పటికీ, భారత్-జెన్ విశిష్టత దాని సార్వభౌమ, ప్రభుత్వ మద్దతు గల స్వభావంలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది సాంకేతిక మార్పు ప్రారంభ దశలోనే ప్రభుత్వం తీసుకున్న చురుకైన విధానపరమైన దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన వివరించారు

భారత్ జెన్ "సమగ్ర శాస్త్ర విజ్ఞానం, సమగ్ర ప్రభుత్వం, సమగ్ర దేశం" నమూనాకు నిదర్శనమని కేంద్ర మంత్రి అన్నారు. ఐఐటీ బాంబేలోని టీఐహెచ్ ఫౌండేషన్ ఫర్ ఐఓటీ, ఐఓఈ నేతృత్వంలోని కన్సార్టియం ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో ఐఐఐటి హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మండి, ఐఐటీ కాన్పూర్, ఐఐఎం ఇండోర్, ఐఐటీ మద్రాస్ వంటి భాగస్వామ్య సంస్థలు ఉన్నాయి. దీనికి నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్ (ఎన్ఎం- ఐసీపిఎస్) ద్వారా డీఎస్టీ రూ. 235 కోట్ల నిధులతో మద్దతు ఇస్తుండగా, ఎంఈఐటీవై కింద రూ. 10,585 కోట్ల వ్యయంతో కూడిన ఇండియా ఏఐ మిషన్ ద్వారా దీనిని మరింత బలోపేతం చేశారు.

ఈ ప్రాజెక్ట్ సాంకేతిక ప్రాధాన్యతను వివరిస్తూ, భారత్ జెన్ టెక్స్ట్-ఆధారిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, టెక్స్ట్-టు-స్పీచ్, ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ వంటి స్పీచ్ టెక్నాలజీలు, డాక్యుమెంట్ విజన్-లాంగ్వేజ్ మోడల్స్‌తో సహా బహుళ ఏఐ పద్ధతులలో విస్తరించి ఉందని మంత్రి పేర్కొన్నారు. పాలన, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం న్యాయ వ్యవస్థల్లో, ముఖ్యంగా భాషా వైవిధ్యం ఉన్న ప్రాంతాల్లో సమ్మిళిత, భారత్-కేంద్రీకృత అనువర్తనాల కోసం భారత్ జెన్ ఫౌండేషన్ మోడల్స్ ను రూపొందించారని ఆయన పేర్కొన్నారు.

ఆయుర్వేదం కోసం 'ఆయుర్ పరమ్', వ్యవసాయం కోసం 'అగ్రి పరమ్', భారతీయ న్యాయ రంగం కోసం 'లీగల్ పరమ్' వంటి డొమైన్-నిర్దిష్ట మోడళ్లను భారత్ జెన్ ఇప్పటికే విడుదల చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. 22 భారతీయ భాషలలో, 17 బిలియన్ ప్రామాణికాలతో కూడిన కూడిన పరమ్-2 టెక్స్ట్ ఫౌండేషన్ మోడల్, 12 భారతీయ భాషలలో శ్రుతం స్పీచ్-టు-టెక్స్ట్ మోడల్స్, 12 భాషలలో సూక్తం టెక్స్ట్-టు-స్పీచ్ మోడల్స్, సంక్లిష్టమైన భారతీయ పత్రాలను బహుభాషా పరంగా విశ్లేషించడానికి డాక్‌బోధ్ ఫ్రేమ్‌వర్క్ కింద పత్రం మోడల్స్‌తో సహా భారత్ జెన్ సరికొత్త మోడళ్లను గౌరవన ప్రధానమంత్రి ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు.

భారతదేశ భాషా వైవిధ్యం 22 షెడ్యూల్డ్ భాషలకే పరిమితం కాదని మంత్రి స్పష్టం చేశారు. విస్తృతంగా మాట్లాడే ప్రాంతీయ భాషలు, మాండలికాలను చేర్చడానికి డేటాసెట్‌లను నిరంతరం విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. శాస్త్రీయ పురోగతి అనేది పరిపాలనాపరమైన సరిహద్దులకు లోబడి ఉండకూడదని, ముఖ్యంగా డిజిటల్ ఆరోగ్యం, ప్రజా సేవల పంపిణీ వంటి రంగాలలో వాస్తవ ప్రపంచ భాషా వైవిధ్యానికి అనుగుణంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

భారత్ జెన్ వ్యవస్థ విద్యాసంస్థలు, ప్రభుత్వం, పరిశ్రమలను ఏకం చేస్తూ, ఉమ్మడి నిధుల యంత్రాంగం ద్వారా మద్దతు పొందుతుందని డాక్టర్ సింగ్ తెలియ చేశారు. ఈ చొరవ ఇప్పుడు సెక్షన్-8 కంపెనీగా, 'భారత్ జెన్ టెక్నాలజీ ఫౌండేషన్' గా రూపాంతరం చెందిందని ఆయన పేర్కొన్నారు. ఇది జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి వీలు కల్పిస్తుందని, అలాగే 'భారత్ డేటా సాగర్' వంటి కార్యక్రమాల ద్వారా డేటా, మోడల్ సార్వభౌమత్వాన్ని నిర్ధారిస్తుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఆలోచనా దృక్పథం మారాలని మంత్రి పిలుపునిచ్చారు. ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు విడివిడిగా కాకుండా, అందరూ కలిసికట్టుగా పనిచేసే విధానాలు అవసరమని ఆయన అన్నారు. సహాయక విధానాలు, ప్రారంభ దశలో నిధుల మద్దతు, ప్రైవేట్ భాగస్వామ్యానికి తలుపులు తెరవడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. దీనివల్ల ప్రపంచ పురోగతితో సమానంగా భారత్ అడుగులు వేయగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భారత్ జెన్ సీఈఓ శ్రీ రిషి బాల్, ఐఐటీ బాంబే ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ గణేష్ రామకృష్ణన్, ఐఐఐటి హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్. రవికిరణ్, భారత్ జెన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అవెూల్ గీతే కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రాజెక్ట్ వ్యవస్థ, డేటా ప్రయాణం, వినియోగానికి సిద్ధంగా ఉన్న వేదికలు, వివిధ రంగాలతో కుదుర్చుకున్న భాగస్వామ్యాల గురించి వారు వివరించారు. ఎన్ఎంఐసీపీఎస్ ఛైర్మన్ డాక్టర్ క్రిస్ గోపాలకృష్ణన్, ఎంఈఐటీవై కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్, డీఎస్టీ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరందీకర్, ప్రధాన శాస్త్ర సలహాదారు (పీఎస్ఏ) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో భారత్ జెన్, ఐఐటీ బాంబే హెరిటేజ్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

డాక్టర్ జితేంద్ర సింగ్ తన ప్రసంగాన్ని ముగిస్తూ, భారత్ జెన్ సార్వభౌమ సామర్థ్యం, సమష్టి అమలు, సమ్మిళిత రూపాన్ని కలుపుకుంటూ భారత ఏఐ ప్రయాణంలో ఒక కొత్త దశను సూచిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా, ఒక బలమైన జాతీయ ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఉద్ఘాటించారు.

## భూ రీసర్వేను వేగవంతంగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ చంద్రయ్య



ఆదిలాబాద్, ఫిబ్రవరి 19: జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి చంద్రయ్య అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పరిధిలో జరుగుతున్న రాంపూర్ గ్రామం రీసర్వే ప్రక్రియ పనులను పరిశీలించారు.

రికార్డుల ఆధారంగా రీ సర్వే సక్రమంగా జరగాలని, రైతుల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుగా సమాచారం అందించాలని సూచించారు. రైతులు భూ వివాదాలు ఏమైనా ఉంటే రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించి సరి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోత్స్న, సర్పంచ్ మాసాడి తిరుపతి, రీ సర్వే డీటీ, మండల సర్వేయర్, వీఆర్, గ్రామ సర్వేయర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రినిఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆసుపత్రిలో వివిధ మెడికల్ వార్డులను సందర్శించి, రోగులు, వైద్య అధికారులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర విషయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే అత్యుత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని అధికారులను సూచించారు. ఒకే పడకపై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించి, వారికి ఎందుకు వేరు వేరు బెడ్లు ఇవ్వలేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఐసీయూ విభాగాన్ని సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. ఆర్థోపెడిక్ విభాగంలో రోజుకు ఎన్ని శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ప్రశ్నించగా, రోజుకు 3 నుంచి 5 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని అధికారులు వివరించారు. ఆసుపత్రి నిర్వాహణపై పలు సూచనలు చేశార. ఆమె వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, సీనియర్ వైద్యురాలు డాక్టర్ మాధవి, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత 38,000 జీపీయూలకు అదనంగా మరో 20,000 జీపీయూలతో దేశ ఏఐ మౌలిక సదుపాయాల బలోపేతం




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 రెండో రోజున కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత 38,000 జీపీయూలకు అదనంగా మరో 20,000 జీపీయూలను జోడించడం ద్వారా.. రాబోయే కొన్ని వారాల్లోనే భారత్ తన కంప్యూట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకోనుందని ఆయన వెల్లడించారు. భారత ఏఐ వ్యూహంలో తదుపరి దశకు ఇది సంకేతమనీ, కంప్యూట్ మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు బాధ్యతాయుతమైన ఏఐ వినియోగంపై తాము దృష్టి సారించామని ఆయన స్పష్టం చేశారు.

సమ్మిట్‌లో మీడియాను ద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా ఏఐ అభివృది పైనే తాము ప్రధానంగా దృష్టి సారించామని పునరుద్ఘాటించారు. కృత్రిమ మేధ ప్రయోజనాలు అందరికీ అందేలా చూడడం కోసం.. ఆరోగ్యం, విద్యా రంగాల్లో విస్తృతంగా దీన్ని వినియోగిస్తామని తెలిపారు.

సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు భారత ఏఐ వ్యూహమే నిదర్శనమని శ్రీ అశ్వినీ వైష్ణవ్ వ్యాఖ్యానించారు. ఇతర దేశాల్లో ఏఐ మౌలిక సదుపాయాలు కొన్ని కంపెనీల నియంత్రణలోనే ఉండగా.. భారత్ మాత్రం దేశంలోని అన్ని వర్గాలకు విస్తృతంగా ఏఐ కంప్యూట్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఆయన వివరించారు.

ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద, కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో శ్రీ అభిషేక్ సింగ్ ఈ చర్చలో పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న ఈ సదస్సు.. వివిధ దేశాల అధినేతలు, ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, అంతర్జాతీయ సాంకేతిక రంగ ప్రముఖులు, బహుపాక్షిక సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములు, అంకుర సంస్థలు, విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చింది.

ఈ సదస్సులో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యమూ బలంగా ఉందని మంత్రి తెలిపారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థల అగ్రశ్రేణి కార్యనిర్వాహకులు దాదాపు 20 సదస్సులు నిర్వహిస్తున్నారనీ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో అగ్రగాములకు భారత్ పట్ల ఉన్న నిబద్ధతను ఇది చాటుతోందనీ ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అతిపెద్ద ఏఐ సదస్సుగా గుర్తింపు పొందిన ఈ కార్యక్రమ నిర్వహణ కోసం మొత్తం బృందం రేయింబవళ్లూ కృషిచేస్తోందంటూ ప్రశంసించారు.

పెట్టుబడి అవకాశాలపై శ్రీ వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే రెండేళ్లలో 200 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. డీప్‌టెక్ స్టార్టప్‌ల పట్ల వెంచర్ క్యాపిటల్ సంస్థలు అమితాసక్తిని కనబరుస్తున్నాయని గుర్తు చేశారు. ఏఐ రంగంలోని మొత్తం అయిదు దశల నుంచీ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన తెలిపారు. భారీ స్థాయి ప్రాజెక్టులు, ప్రధానమైన అప్లికేషన్ల కోసం వెంచర్ క్యాపిటల్ సంస్థలు నిధులను కేటాయిస్తున్నాయనీ ఆయన తెలిపారు.

భారతదేశ అతిపెద్ద బలాల్లో ఐటీ రంగం ఒకటనీ, సాంకేతికతలో వచ్చే ప్రతి మార్పునూ పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రభుత్వం ఉమ్మడిగా అందిపుచ్చుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు ప్రధాన అంశాలపై ప్రభుత్వం కృషిచేస్తోంది: ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, కొత్త నైపుణ్యాలపై శిక్షణ, కొత్త ప్రతిభా వంతులను సిద్ధం చేయడం, అత్యాధునిక సాంకేతికతలకు అనుగుణంగా భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడం. ఈ మూడు ప్రయత్నాలు సమాంతరంగా కొనసాగుతున్నాయి.

విద్యుత్ సామర్థ్యం గురించి ప్రస్తావిస్తూ.. శుద్ధ ఇంధన వనరుల నుంచే 50 శాతానికి పైగా విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న అరుదైన దేశాలలో భారత్ ఒకటి అని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది 51 శాతంగా ఉందనీ, ఇది దేశానికి ఒక గొప్ప సానుకూలత అనీ అన్నారు. మూడేళ్ల కిందట ప్రారంభించిన ఫ్యూచర్ స్కిల్స్ కార్యక్రమాన్ని ఇప్పుడు ఏఐ ఆధారిత నైపుణ్య శిక్షణ కోసం ఉపయోగిస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త అవకాశాలను అందుకునేలా యువతను తీర్చిదిద్దేందుకు, మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికను మార్చేందుకు విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ కలిసి పనిచేస్తున్నాయని ఆయన వివరించారు.

భారత దేశీయ ఏఐ మోడళ్ల గురించి మంత్రి మాట్లాడుతూ... ఈ సదస్సులో ప్రారంభించిన పలు మోడళ్లను వివిధ ప్రమాణాల ఆధారంగా పరీక్షించినట్లు తెలిపారు. అంతర్జాతీయ మోడళ్లతో పోల్చి చూస్తే - పలు దేశీయ మోడళ్లు అనేక భారీ అంతర్జాతీయ ఏఐ వ్యవస్థల కన్నా మెరుగైన రేటింగ్‌ను సాధించాయనీ, ఇది భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని చాటుతోందనీ ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో అగ్రగామిగా ఉన్న మొదటి మూడు దేశాల్లో ఒకటిగా మన దేశానికి స్టాన్‌ఫోర్డ్ ర్యాంకు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కృత్రిమ మేధ దుర్వినియోగమయ్యే ముప్పు ఉందని అంగీకరిస్తూ.. ఏఐని మంచి పనుల కోసం ఉపయోగిస్తూనే, దాని వల్ల కలిగే హానిని తగ్గించడానికి టెక్నో-లీగల్ విధానం చాలా ముఖ్యమైనదని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం సాంకేతిక పరిష్కారాలను, చట్టపరమైన నిబంధనలను అనుసంధానిస్తుంది. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అవసరమైన సాంకేతిక మార్గాలను దేశ ఏఐ సేఫ్టీ ఇనిస్టిట్యూట్ అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. పలు విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తున్న వర్చువల్ సంస్థ ఇది.

రంగాలవారీగా ఏఐ వినియోగం గురించి శ్రీ వైష్ణవ్ మాట్లాడుతూ.. అయిదో పారిశ్రామిక విప్లవానికి కృత్రిమ మేధ నాంది పలుకుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థతోపాటు సమాజంలోని ప్రతి రంగాన్నీ ఇది ప్రభావితం చేస్తుందన్నారు. ఈ సదస్సులో ప్రదర్శించిన ఆరోగ్య రంగ సాధనాలు వైద్య సేవలను సామాన్యులకు మరింత అందుబాటు ధరల్లోకి తెస్తాయని, అలాగే విద్యా రంగ సాధనాలు ప్రతి విద్యార్థికి వారి అవసరాలకు తగ్గట్టుగా వ్యక్తిగత బోధనను అందిస్తాయని ఆయన ఉదాహరణలతో పేర్కొన్నారు.

చిప్ డెవలప్మెంట్ గురించి మాట్లాడుతూ.. సెమికండక్టర్ మిషన్ పట్ల భారత్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. సెమికండక్టర్ 2.0లో డిజైన్ అంశంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ఆవిష్కరణలు, అభివృద్ధి చర్యల ఫలితంగా.. రాబోయే కొన్నేళ్లలో భారత్ నుంచి కనీసం 50 డీప్‌టెక్ అంకుర సంస్థలు పుట్టుకొస్తాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

పర్యావరణ సుస్థిరత గురించి ప్రస్తావిస్తూ.. ఏఐ డేటా సెంటర్లకు విద్యుత్తును అందించడానికి శుద్ధ ఇంధన వనరులపై పెట్టుబడులు పెడుతున్నామని మంత్రి తెలిపారు. అలాగే డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్, నీటి వినియోగాన్ని తగ్గించడానికి పరిశోధనలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుత కొత్త ఆవిష్కరణల ద్వారా ఏఐ మౌలిక సదుపాయాల ఇంధన వినియోగాన్ని 35 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

సదస్సు మొదటి రోజే సుమారు 2.5 లక్షల మందికి పైగా విద్యార్థులు బాధ్యతాయుత ఆవిష్కరణల కోసం ఏఐని ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేశారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు కోసం పంపిస్తున్నట్టు ఆయన తెలిపారు.

బాధ్యతాయుత రీతిలో ఏఐని అభివృద్ధి చేయడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా వివిధ రంగాల్లో దీన్ని విస్తృతంగా అందుబాటులోకి తేవడానికి భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

## నల్లగొండ కలెక్టర్ మానవత్వం



నల్లగొండ, ఫిబ్రవరి 19 : నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మానవత్వం చూపారు. కొండామల్లేపల్లి నుండి నల్లగొండ వచ్చే దారిలో ధర్వేశిపురం గుడి దగ్గరలో వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో అప్పుడే జరిగిన యాక్సిడెంట్‌ను చూసి మానవత్వం దృక్పథంతో చల్లించి వెహికల్ దిగి అంబులెన్స్ కి ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చే వరకు దగ్గర ఉండి క్షతగాత్రుడిని ఆస్పత్రికి పంపించారు.

కనగల్ మండల కేంద్రానికి చెందిన ఏకెల్లి పరమేశ్ బైక్‌పై నల్లగొండ నుండి కనగల్ వైపు వెళ్తున్నాడు.

అదే సమయంలో కనగల్ నుండి నల్లగొండ వైపు వెళ్తున్న కారు పరమేశ్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పరమేశ్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అదే సమయంలో అటుగా వస్తున్న కలెక్టర్ రోడ్డు ప్రమాదాన్ని చూసి చలించి బాధితుడిని చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా మార్గమధ్యలో పరిస్థితి విషమించడంతో పరమేశ్ మరణించినట్లు కనగల్ ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు.

# కులగణన అధికారిక గణాంకాలతో బీసీల్లో చైతన్యం

**–61 % చైర్మన్, కౌన్సిలర్లుగా బీసీలు గెలవడం మారుతున్న రాజకీయ వాతావరణానికి నిదర్శనం.**
**– నిరంతర బీసీ ఉద్యమాలతో అంటుకున్న సామాజిక తెలంగాణ నినాదం.**
**–బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్**

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీసీలు 61 శాతం ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించటం తెలంగాణ రాజకీయాల్లో చారిత్రక ఘట్టంగా బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అభివర్ణించారు .తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ద్వారా వెలువడిన అధికారిక గణాంకాలు బీసీలను రాజకీయంగా పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయని దాసు సురేశ్ పేర్కొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం, నిరంతర బీసీ ఉద్యమాల మూలాన రాష్ట్రంలో సామాజిక తెలంగాణ నినాదం అంటుకుందన్నారు.. ఈ ఫలితాలను బట్టి చూస్తే తెలంగాణ రాజకీయాల్లో కుల సమీకరణ పతాక స్థాయికి చేరినట్టు విశదమవుతుందన్నారు . ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లతో వెలువడిన నోటిఫికేషన్ హైకోర్ట్ స్టే తో నిలిపివేయబడటం బీసీలపై జరుగుతున్న అన్యాయం పట్ల ఆలోచనను రేకెత్తించిందన్నారు.. ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో పీసీసీ చీఫ్ గా బీసీనే కాంగ్రెస్ నియమించాలన్న తమ ప్రయత్నాలు ఫలించడం ద్వారా నేడు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రూపంలో పెద్దఎత్తున కాంగ్రెస్ నుండి బీ- ఫారంలను బీసీ లు పొందే అవకాశం కలిగిం దన్నారు..తద్వారా బీసీలు మెరుగైన ఫలితాలు సాధించే వీలు కలిగిందన్నారు..తాము ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నియమించిన కమిటీలతో, నిర్వహించిన కార్యక్రమాలతో పట్టణాలు, గ్రామాల వరకు బీసీ రాజ్యాధికార భావజాలం విస్తరించి సత్ఫలితాలను ఇస్తుందన్నారు.. బీసీలలో వస్తున్న క్షేత్ర స్థాయి చైతన్యాన్ని గమనించి కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల మూలంగానే అద్భుత విజయాన్ని సాధించ గలిగిందన్నారు. మారుతున్న ప్రజల చైతన్యాన్ని బట్టి ఇకనైనా అట్టడుగు,బిసి వర్గాల పట్ల రాజకీయ పార్టీలు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. అవకాశాలు వస్తే రాజకీయాల్లో సైతం అద్భుతంగా రాణించగలమని బీసీలు పంచాయతీ, పట్టణ ఎన్నికలలో నిరూపించారన్నారు.. ఈ చైతన్యానికి చట్టసభల్లో కొనసాగించటమే ఇక మిగిలిందని వెల్లడించారు. రాబోయే గ్రేటర్ ఎంపీటీసీ, జడ్పిటిసి లలో సైతం ఇవే ఫలితాలు పునరావృత్తం అవుతాయని తేల్చి చెప్పారు.



